క్లుప్తంగా

పరామర్శ



గోపాల్‌శెట్టి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని చెర్లోపల్లె గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొరస్వామి కుటుంబాన్ని ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. దొరస్వామి తండ్రి కూరగాయల గోపాల్‌శెట్టి ఈనెల17న మరణించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం అనంతరం దొరస్వామి, ఆయన భార్య, స్థానిక ఎంపీటీసీ హరిత తదితరులను మోహిత్‌రెడ్డి పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని ఓదార్చారు. పరామర్శించిన వారిలో పార్టీ సీనియర్ నేత విప్పర్ల వాసుదేవ నాయుడు, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపాటి మునీశ్వర రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు యాళ్ల చెంచుమోహన్ యాదవ్, గొల్లపల్లె సర్పంచ్ రవిరెడ్డి, మండల పార్టీ కార్యదర్శి గోపి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర వున్నారు.

కందారపు మురళికి మాజీ ఎమ్మెల్సీల పరామర్శ

తిరుపతి కల్చరల్: తల్లిని కోల్పోయి విషాదంలో ఉన్న సీపీఎం నేత, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి కుటుంబ సభ్యులను శాసన మండలి మాజీ చైర్మన్ విఠపు బాల సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆదివారం వారి నివాసంలో పరామర్శించారు. 23న బుధవారం కందారపు రాజమ్మ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు వారికి చెప్పారు. కార్యక్రమంలో కందారపు మోహన్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేత రాహుల్, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు టూవీలర్స్ మెకానిక్ కుటుంబాలకు తిరుపతి టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గోపాల్(తిరుపతి), చిన్నతంబి(చంద్రగిరి), సుబ్రమణ్యం(తలకోన)కు చెందిన మెకానిక్‌లకు ఈ సాయం చేశారు.. అలాగే 70 మందికి స్పెసల్ టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఇబ్బందుల్లో ఉన్న మెకానిక్స్‌కు అసోసియేషన్ ఎప్పుడూ చేతనైనంత సాయం చేస్తుందని మునిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి గురు ఆచారి, సహాయ కార్యదర్శి తేజారెడ్డి, కోశాధికారి బాబు, నాగరాజు, పాపయ్య, మురుగ, మెకానిక్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక



రామచంద్రాపురం: మండలంలోని యోగుల పర్వతంపై ఉన్న శ్రీ జ్ఞాన కుమారస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా ఆడికృత్తిక వేడుకలు నిర్వహించారు. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతాప్ స్వామీజీ ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, అలంకార పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

నృత్యం..మంత్రముగ్ధం



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలోవారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన పెద్దబాబయ్య శిష్య బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. మూషిక వాహన- అంటూ సాగిన పాటతో మొదలై వేదములే శ్రీనివాసం, ముద్దుగారే యశోద, నగుమోము కనలేని, భో శంభో, పుష్పాంజలి, శ్రీరామ నీ నామము, అయిగిరి నందిని, ఒకపరి ఒకపరి, బ్రహ్మామొక్కటే..తదిదర పాటలకు కళాకారులు వేదశ్రీ, కేథరిన్, హేమస్విని, ధనలక్ష్మి, ధనశ్రీ, హరి, నితిన్, దుర్గ, భవిష్య తమ నృత్య ప్రదర్శనతో మంత్రముగ్ధుల్ని చేశారు. ఇన్‌చార్జ్ ఏట సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

కూటమి పాలనలో సంక్షేమం నిల్..!

- జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- హామీలు నెరవేర్చకుండా దగా చేస్తున్న చంద్రబాబు
- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించిన భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి 49వ డివిజన్‌లో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : గత ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందితే, తాను అధికారంలోకి వస్తే రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తానని ఊదరగొట్టి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా తమను బాండ్ల పేరిట వంచించారని పలువురు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ఆదివారం వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో కలిసి తిరుపతిలోని 16, 24, 32, 49వ వార్డులతో పాటు శెట్టిపల్లె, ఉప్పరపల్లెలో ఇంటింటా ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలతో పాటు మొత్తం 143 హామీలు ఇచ్చారని, ఇవి నమ్మి ప్రజలు పట్టం కడితే ఏ ఒక్క పథకమైనా మీకు అందుతోందా? అని ప్రజలను ఆరా తీశారు. తమకైతే పథకాల ఫలాలు అందలేదని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలు నెరవేర్చకపోవడం దారుణమని ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై మండిపడ్డారు. కూటమి నాయకులు తమ ఇళ్ల వద్దకు వస్తే నిలదీస్తామని చెప్పారు.

ఒక్కొక్క ఇంటికి రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు మోసం

గత ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన మేనిఫెస్టో హామీల ప్రకారం 13 నెలలకు గాను ఒక్కొక్క ఇంటికి రూ. లక్ష నుంచి రూ. 2లక్షల వరకు ప్రజలు లబ్ధి పొందాల్సి ఉందని, అయితే ఒక్క రూపాయి కూడా సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు ఇవ్వకుండా చంద్రబాబు నిలువునా ముంచారని భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి, వాటిని తుంగలో తొక్కారని ప్రజలు సైతం గ్రహించారని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం ఏమాత్రమూ లేకున్నా కూటమి నాయకులు అవినీతి అక్రమాలతో ప్రకృతి వనరులను దోచేస్తూ జేబులు నింపుకుంటున్నారని, 'సుపరిపాలనలో ఇదే తొలి అడుగు' అని వ్యంగ్యంగా అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మోహన్ కృష్ణయాదవ్, పార్టీ నాయకులు తలారి రాజేంద్ర, సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాదరి, నవీన్ బ్యాంగీ, జీవకోన రెడ్డెప్పరెడ్డి, మురళి, మహ్మద్‌బాషా, ఆటో ప్రసాద్, స్వరూప్, కిరణ్, బత్తినబాబు, జగన్, సురేష్, అరుణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్ట్ రాజకీయ కుట్రే

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం , అభివృద్ధిపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష పార్టీలపై రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. ఈ దిశగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమని, ఇది ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని పలువురు ఖండించారు.

కక్ష పూరితంగానే అరెస్ట్



ఎంపీ మిథున్‌రెడ్డిని కక్ష పూరిత ధోరణితో అరెస్ట్ చేశారు. ఆయనపై అక్రమంగా లిక్కర్ కేసులు బనాయించడం గర్హనీయం. భవిష్యత్తులో దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

- డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు, తిరుపతి

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే..!



ఎంపీ మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కామ్ పేరిట అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నా. కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజావ్యతిరేకత మూటకట్టుకుంది. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలా చేస్తోంది.

-మురళీధర్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి, తిరుపతి

అరెస్ట్ దుర్మార్గం



ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. వైఎస్సార్ సీపీ నాయకులను తప్పుడు కేసులు మోపి అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు.

- ఎం.ప్రేమ్‌కుమార్, ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, తిరుపతి

సందేశాత్మకంగా నాటకాలు



ఆచమనం సాంఘిక నాటికలోని దృశ్యం



విడాకులు కావాలి సాంఘిక నాటికలో ఒక సన్నివేశం

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ రజతోత్స హనుమ అవార్డ్స్ జాతీయ నాటక పోటీలలో భాగంగా ఆదివారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు చక్కటి సందేశాత్మకంగా సాగుతూ ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించాయి. ఉదయం శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ప్రదర్శించిన 'జగదేక సామ' పద్య నాటకం పౌరాణిక విశిష్టతను చాటింది. ఆ తర్వాత గుంటూరు శ్రీఅరవింద ఆర్ట్స్ ప్రదర్శించిన 'విడాకులు కావాలి' సాంఘిక నాటిక.. ఆధునిక సమాజంలో భార్యాభర్తల దాంపత్య జీవితంలో తలెత్తున్న అభిప్రాయ భేదాలు, పంతాలకు పోయి విడాకులతో కుటుంబ జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకునే పరిస్థితులను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అహంకారం, పట్టుదల వీడి సమన్వయం పాటిస్తే ఆదర్శ దంపతులుగా జీవించవచ్చనే సందేశమిచ్చింది. అనంతరం కాకినాడ ఎస్వీ.రంగారావు కళాస్రవంతి ప్రదర్శించిన 'ఆచమనం' సాంఘిక నాటిక..ప్రస్తుత సమాజంలో ఒక మధ్య తరగతి కుటుంబం జీవన శైలి ఇతివృత్తంగా సాగింది. చాలీచాలని సంపాదన, కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం లక్షల అప్పు చేసే మధ్య తరగతి వ్యక్తి జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను కళాకారులు తమ నటనతో కదిలించారు. అప్పులు తీర్చలేక కుంగిపోయి ఆత్మహత్య నిర్ణయం తీసుకునే ముందు ముందు తన కుటుంబంలోని భార్య, బిడ్డలు, తల్లిదండ్రులను గుర్తుచేసుకుంటే ఆత్మహత్య ఆలోచనే రాదనే సత్యాన్ని చెప్పారు. అనంతరం కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో సత్కరించారు.

నాలుక మడతేసిన మంత్రి లోకేష్

- స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

తిరుపతి కల్చరల్: అదాని కంపెనీ ప్రయోజనాల కోసమే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, ప్రజలపై భారాలుమోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. 'స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి' అని ఎన్నికల ప్రచారంలో పిలుపునిచ్చిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక నాలుక మడతపెట్టి, స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల మోతకు వ్యతిరేకంగా ఈనెల 16 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. టీటీడీని నిత్యం వివాదాలకు కేంద్రంగా మారుస్తున్నారని, కేంద్రంలోని బీజేపీ నేతలు, మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇందుకు మినహాయింపేమీ కాదని మండిపడ్డారు. తిరుపతిలో మత ఉద్రిక్తతలు పెంచడమే లక్ష్యంగా బీజేపీ కార్యకలాపాలు ఉంటున్నాయని, దీనిపై ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, సుబ్రమణ్యం, పుల్లయ్య, సాయిలక్ష్మి, ఆర్. లక్ష్మి, జయచంద్ర, వేణుగోపాల్, శివకుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- ఎస్వీ శిల్ప కళాశాలలో ఫస్టియర్ అడ్మిషన్ల కోసం విద్యార్థులకు ఉదయం 9 గంటలకు కళాశాలలో ప్రవేశ పరీక్షలు.
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్.
- కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల ఫిర్యాదులు స్వీకరణ.
- అక్టోబర్ ఈ-సేవా టిక్కెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కార్యక్రమం.
- తిరుచానూరులోని శ్రీబాలకృష్ణ స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి ఊరేగింపు.
- మహతి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు నృత్య పోటీలు, సాయంత్రం 4 గంటలకు 'విష్ణు వర్ధనుడు' పౌరాణిక పద్యనాటకం, 6.30 గంటలకు 'సారీ రాంగ్ నెంబర్' సాంఘిక నాటిక ప్రదర్శన.

గోవిందధామం నూతన కార్యవర్గం ఎన్నిక



గోవిందధామానికి ఎన్నికైన నూతన పాలకవర్గం

తిరుపతి మంగళం: తిరుపతి-కరకంబాడి మార్గంలోని మహాప్రస్థాన సేవాసమితి గోవిందధామం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం ప్రత్యేక అతిథిగా రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్రశెట్టి , వ్యవస్థాపక అధ్యక్షులు టెంకాయల దామోదరం సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు గోవిందధామంలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా జూలకంటి లక్ష్మి, కార్యదర్శిగా రామశేఖర్, కోశాధికారిగా హేమచందర్, ఉపాధ్యక్షులుగా సోము, రవికుమార్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సహకోశాధికారిగా నామ రాజేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. గోవిందధామం సలహాదారులు, రిటైర్డ్ కార్పొరేషన్ కమిషనర్ మోహన్ రెడ్డి, న్యాయ సలహాదారు మట్టా పురుషోత్తం రెడ్డి, ఆడిటర్ జగదీష్, ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ మురళి, ప్రొఫెసర్ చలపతి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, జక్కా సుబ్బరాజు, చౌదరి, ఆదం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



పాకాల: కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



తిరుపతిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాకాల: మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో కృష్ణాపురం గ్రామం ప్రగతి గ్రామీణ అభివృద్ధి ట్రస్ట్ ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని ట్రస్ట్ అధ్యక్షుడు నాగరాజ నాయుడు తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి, డీబీసీఎస్ సహకారంతో వైద్యులు నీలిమ, ప్రత్యూష బృందం దాదాపు 250 మంది కంటి వైద్య పరీక్షలు చేసి 55 మందిని కంటి ఆపరేషన్లకు చేసింది. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారిని అరవింద్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు చక్రవర్తినాయుడు, కార్యదర్శి జయచంద్ర, సహాయ కార్యదర్శి మునస్వామినాయుడు, కోశాధికారి శివమణి, క్యాంపు ఇన్‌చార్జి జీవన్‌రావు, క్యాంపు వలంటీర్ శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు వనపర్తి వెంకటసిద్దులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో..

తిరుపతి రూరల్: తిరుచానూరు ఆర్యవైశ్య యువజన సంఘం ఆదివారం తిరుపతిలోని కపిల తీర్థం వద్ద గోనివాస్ వద్ద అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. శిబిరంలో 150 మందిని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ విష్ణువర్ధన్ పరీక్షించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఆర్య వైశ్య యువజనసంఘం అధ్యక్షుడు పెడబల్లె వికాస్, కార్తీక్, శబరీష్, దర్శన్, అభిలాష్, వెంకటేష్, వినోద్, అశ్విన్, .దనరాజ్, హేమంత్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నగర నూతన కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: సీపీఐ నగర నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. నగర కార్యదర్శిగా జె.విశ్వనాథ్, సహాయ కార్యదర్శిగా బండి చలపతి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 61 మందితో కూడిన నూతన కౌన్సిల్ ఏర్పాటు చేసిన కౌన్సిల్ నుంచి 13 మంది కార్యవర్గ సభ్యులుగా నియమించారు. రెండు రోజుల సీపీఐ నగర మహాసభల ముగింపు సందర్భంగా వివిధ సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. వీటి పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాల రూపకల్పన చేయనున్నట్లు కమిటీ తెలిపింది.

మెకానిక్స్ సంక్షేమం కోసం కృషి

తిరుపతి కల్చరల్: మెకానిక్స్ సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తామని శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎస్ అర్.బాషా తెలిపారు. ఆదివారం యూత్ హాస్టల్లో శ్రీబాలాజీ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్, నవ్యాంధ్ర టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆత్మీయ సమావేశం నిర్వహించాయి. మెకానిక్స్ ఏ కష్టమొచ్చినా వారికి అండగా నిలుస్తామని నేతలు చెప్పారు. అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలని కార్యక్రమంలో కూటమి నేతలు నరసింహయాదవ్, ముబ్బుదేవనారాయణరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్, ఉపాధ్యక్షుడు చందు, కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి ఎస్.షఫీ, సహాయ కార్యదర్శి వి.ఆనంద్, సభ్యులు మధుకుమార్, జాకీర్, విశ్వనాథ్, ప్రసాద్, భవాని శంకర్, అశోక్, సాంబశివరావు,అన్వర్ బాషా, గోపినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపార రంగాల ఉన్నతికి చక్కటి వేదిక బీఎన్‌ఐ



తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న బీఎన్ఐ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వివిధ వ్యాపార రంగాలు, పారిశ్రామిక రంగాలలోని వారు ఉన్నతంగా ఎదిగేందుకు బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్ఐ) చక్కటి వేదికగా దోహదపడుతుందని తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతిలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో కాన్‌క్లేవ్-2.0 పేరిట వ్యాపార, పారిశ్రామికవేత్తల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తుడా చైర్మన్ మాట్లాడారు. వెయ్యికి పైగా బిజినెస్ సంస్థలను ఒక చోట చేర్చి బిజినెస్ ఐడియాలజీలను ఇతర కంపెనీలతో పంచుకునేందుకు బీఎన్ఐ కృషి చేయడం అభినందనీయమన్నారు. బీఎన్ఐ ఈడీ మాట్లాడుతూ, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ వ్యాపారాలను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు ప్రతి ఏటా ఇలాంటి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బీఎన్ఐ సభ్యులు, పారిశ్రామివేత్తలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమ్మేళనంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యాపార రంగ సంస్థల స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఎన్ఐ తిరుపతి రీజియన్ చైర్మన్ మణి సందీప్, కో-చైర్మన్ టెంకాలయ దుర్గాప్రసాద్, కన్వీనర్ యుగంధర్, స్పాన్సర్ కో-ఆర్డినేటర్ వంశీకృష్ణారెడ్డి, సాయికిరణ్, స్వాతి, బీఎన్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం



తమ గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రం జెడ్పీ హైస్కూల్లో 1983-84 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పరస్పర పరిచయాలతో సందడి చేశారు. అప్పటి హెచ్‌ఎం మునిరెడ్డి, సైన్స్ టీచర్ మల్లికార్జునరెడ్డి, పీఈటీ రామ్మూర్తిలను సత్కరించి ఆశీస్సులు పొందారు. తాము వివిధ రంగాల్లో స్థిరపడటం వెనుక గురుదేవుల విద్యాబోధనే కారణమన్నారు. స్కూలు అభివృద్ధికి తమవంతు తోడ్పాటునిస్తామన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరిస్తా

తిరుపతి రూరల్: మండలంలోని తనపల్లె పద్మగిరి కొండపై ఉన్న శ్రీ బాల దండాయుధపాణి స్వామి ఆలయాన్ని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామి వారి చిత్రపటం అందజేశారు. అర్చకులు ఆశీర్వచనం పలికారు. ఆలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, సందీప్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బదిలీ పంచాయతీ సిబ్బందికి వీడ్కోలు



తొండవాడ పంచాయతీ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ మల్లం దీపిక, వైఎస్సార్‌సీపీ నేత మల్లం చంద్రమౌళి రెడ్డి

చంద్రగిరి: వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన తొండవాడ పంచాయతీ సిబ్బందిని ఆదివారం సర్పంచ్ మల్లం దీపికారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా వ్యవసాయ విభాగం అధ్యక్షుడు మల్లం చంద్రమౌళి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. వారు మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధికి సిబ్బంది ఎనలేని కృషి చేశారని వారి సేవలను ప్రస్తుతించారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తే అదే గుర్తింపు తెస్తుందన్నారు.

నిఘా నీడలో కలెక్టరేట్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం నిఘా నీడలోకి వచ్చింది. తిరుచానూరు వద్దనున్న పద్మావతీ నిలయంలో ఉన్న కలెక్టరేట్‌లో 40 శాఖలకు సంబంధించి 500 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ సమస్యలు నివేదించేందుకు వస్తుంటారు. ఇక సోమవారం అయితే జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి అర్జీలు ఇవ్వడం, మరికొందరు సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వెలుపల ఆందోళన చేయడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఇక్కడ రాకపోకలకు సంబంధించి ప్రత్యేకంగా మూడు కెమెరాలను ఇటీవలే ఏర్పాటు చేశారు.



కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసి ఉన్న సీసీ కెమెరాలు